సాక్షి
పెద్దపల్లి

గురువారం । 5 । సెప్టెంబర్ । 2024

నాడు వెలవెల



నేడు జలకళ



గోదావరిఖనిటౌన్: గోదావరి నది ప్రస్తుతం ఉధృతంగా ప్రవహిస్తోంది. మొన్నటి వర్షాలకు ముందు నీళ్లులేక వెలవెలబోయిన గోదావరి.. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో ఇలా ఉధృతంగా ప్రవహిస్తోంది.

న్యూస్‌రీల్

'విధుల్లోకి తీసుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న సిబ్బంది

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కాలేజీల్లో పార్ట్‌టైం, ఔట్‌సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్న తమను విధుల నుంచి తొలగించడం అన్యాయమని సిబ్బంది అరవింద్, సురేశ్, రమేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్ ఎదుట బుధవారం నిరసన తెలిపారు. కలెక్టర్ కోయ శ్రీహర్షను కలిసి వినతిపత్రం అందించారు. అధికారులు, పాలకుల మనసును మార్చి తమను మళ్లీ విధుల్లోకి తీసుకునేలా చూడాలని స్థానిక బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి అంతకుముందు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, రవీందర్, ఆనంద్, లింగయ్య, రామకృష్ణారెడ్డి, రాజమౌళి, సంతోష్, ధర్మాచారి, దేవదాసు, రాజేశ్, అనిల్, మల్లేశ్ పాల్గొన్నారు.

వసతులు కల్పించాలి



వివరాలు సేకరిస్తున్న లేబర్ ఆఫీసర్ హేమలత

సుల్తానాబాద్(పెద్దపల్లి): ఉపాధి కోసం పొట్ట చేత పట్టుకుని వచ్చే కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని పెద్దపల్లి అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ హేమలత యజమానులకు సూచించారు. స్థానిక రైల్వేగేట్ సమీపంలోని గోదాములను బుధవారం ఆమె పరిశీలించారు. వసతితోపాటు నిత్యావసరాలు అందించాలని తెలిపారు. మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని సూచించారు. వేతనాల చెల్లింపులపైనా ఆరా తీశారు. కార్మిక సంఘం నాయకుడు బోంకూరి కైలాసం తదితరులు పాల్గొన్నారు.

బ్యాలెట్ బాక్సుల తరలింపు



బ్యాలెట్ బాక్సులు తరలిస్తున్న సిబ్బంది

రామగుండం: జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు అంతర్గాం మండల పరిషత్ కార్యాలయంలోని 209 బ్యాలెట్ బాక్సులను బుధవారం ప్రత్యేక వాహనంలో జిల్లా కేంద్రానికి తరలించారు. జిల్లాలోని మండల పరిషత్ కార్యాలయాల్లో ఉన్న బ్యాలెట్ బాక్సులను తెప్పించుకొని ఆయిలింగ్, లాకింగ్ సమస్యల పరిష్కరిస్తారు. అదేవిధంగా తుప్పు పట్టిన వాటిని శుభ్రం చేయడం, పెయింటింగ్ వేయడం తదితర సాంకేతిక సమస్యలను తొలగించి ఎన్నికలకు సిద్ధం చేసే ప్రక్రియ కొనసాగుతోంది.


నేడు టీచర్లకు సన్మానం

పెద్దపల్లిరూరల్: ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని కలెక్టరేట్‌లో గురువారం సన్మానిస్తామని డీఈవో మాధవి తెలిపారు. జిల్లాలో 42 మంది ఉపాధ్యాయులుగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఉదయం 11 గంటల వరకు కలెక్టరేట్‌కు హాజరుకావాలని డీఈవో కోరారు.

'వడ్డేపల్లి'కి సత్కారం


జ్యోతినగర్: జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్‌ను సింగరేణి ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ సన్మానించారు. ఎన్టీపీసీ జ్యోతిభవన్ అతిథి గృహంలో లలిత్‌కుమార్ ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. సింగరేణి సంస్థకు సంబంధించిన బొగ్గు గనులు, ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన వివరాలను ఆయనకు తెలియజేశారు. ఆర్జీ–1 ఏరియా పర్సనల్ మేనేజర్ కిరణ్ బాబు, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే విజయ్

పెద్దపల్లిరూరల్: సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ సర్కార్ ప్రజాపాలన సాగిస్తూ ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. 173 మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు రూ.కోటి73లక్షల45వేల విలువైన చెక్కులను జిల్లా కేంద్రంలో బుధవారం ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. అన్నివర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సాంకేతిక లోపాలతో లబ్ధిపొందని అర్హుల కోసం ఈనెల 17న మలివిడత ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపడుతున్నామని వివరించారు. తహసీల్దార్ రాజ్‌కుమార్, నాయకులు ఉన్నారు.



భవితకు బాటసార్లు!

అమ్మ ఊపిరి పోస్తుంది. నాన్న నడక నేర్పిస్తాడు. గురువు జీవితాన్ని ఇస్తాడు. గురువు బోధనలే భవిష్యత్‌కు పునాదులు. మారుతున్న కాలానికి అనుగుణంగా బట్టీ చదువులను పక్కకు పెట్టిన టీచర్లు వినూత్న బోధనకు శ్రీకారం చుట్టారు. పుస్తకాలతో కుస్తీ పట్టకుండా ప్రయోగాత్మకంగా పాఠాలు చెబుతున్నారు. పుస్తకంలోని పాఠాన్ని కళ్లకు కట్టినట్లు చూపుతూ.. విద్యార్థుల్లో జ్ఞానాన్ని నింపుతున్నారు. టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ డిజిటలైజేషన్‌లో ముందుకు సాగుతున్నారు. సర్కారు బడుల్లో ఉత్తీర్ణతశాతాన్ని పెంచుతూ విద్యార్థుల భవితకు బాటసార్లుగా నిలుస్తున్నారు. పాఠశాల దశలో వీరి బోధనలను అవపోసన పట్టిన పలువురు వివిధ రంగాల్లో రాణిస్తున్నారు. నేడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని పలువురు ఉత్తమ ఉపాధ్యాయులపై ప్రత్యేక కథనం..!!

- వివరాలు 8లో

53 మంది విద్యార్థులతో ఆవిష్కరణలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:



విద్యార్థులకు ప్రయోగాత్మకంగా పాఠాలు బోధిస్తున్న సంపత్

రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం దమ్మన్నపేట జిల్లా పరిషత్ హైస్కూల్లో ఫిజిక్స్ టీచర్‌గా పని చేస్తున్న సంపత్ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. గురువారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు అందుకో నున్నారు. పాఠ్యాంశాలను ప్ర యోగాత్మకంగా బోధించడం ఆయనకు అలవాటు. పెద్దపల్లి జిల్లా యైటింక్లయిన్ కాలనీకి చెందిన సంపత్ చిన్ననాటి నుంచి ఇస్రోలో శాస్త్రవేత్త కావాలని కలలు కనేవారు. చివరికి ఎంపికైనా సాంకేతిక కారణాలతో తప్పుకో వాల్సి వచ్చింది. అయినా, ఆయన నిరుత్సా హ పడలేదు. తనకున్న తెలివితేటలతో విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని భావించారు. మిషన్–100 లక్ష్యంతో పని చేస్తున్నారు. ఇప్పటివరకు 53 మంది విద్యార్థులతో కొత్త ఆవిష్కరణలు చేయించారు. రిటైరయ్యేలోగా మరో 47 మందితో ఆవిష్కరణలు చేయిస్తానని ధీమాగా చెబుతున్నారు. ఆయన మూడుసార్లు పెద్దపల్లి జిల్లాస్థాయి, ఒకసారి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. 2022లో ఏటీఏపీ జాతీయ పురస్కారం, 2024లో సౌత్ ఇండియా టీచర్స్ సైన్స్ ఫెస్టివల్‌లో అవార్డు అందుకున్నారు.

కాసులకు కక్కుర్తి

- పెద్దపల్లికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల గుండె నొప్పి బారినపడ్డాడు. కుటుంబసభ్యులు వెంటనే ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక వైద్యం అందించిన డాక్టర్లు.. కరీంనగర్ తీసుకెళ్లాలని సూచించారు. దీంతో బంధువులు ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్‌ను ఆశ్రయిస్తే.. రవాణా చార్జి రూ.5వేలు ఇవ్వాలన్నాడు. రాత్రి కావడం, మిగతా వారెవరూ రాలేమనడంతో చేసేది లేక సరేనన్నారు. అయితే, వారు చెప్పిన ఆస్పత్రికి కాకుండా తనకు తెలిసిన ఆస్పత్రికి తీసుకెళ్లాడు డ్రైవర్. అసలే పేషెంట్ కండిషన్ సిరియస్‌గా ఉండటంతో ఆందోళనలో ఉన్న బంధువులు.. గత్యంతరం లేక అతడు చెప్పిన దవాఖానాలోనే అడ్మిట్ చేశారు. తమకు కమీషన్ చెల్లించే ఆస్పత్రులకు తీసుకెళ్తూ అంబులెన్స్ డ్రైవర్లు పేషెంట్ల ప్రాణాలతో ఇలా దందా సాగిస్తున్నారు.



- కమీషన్ ఇచ్చిన ఆస్పత్రికే తరలింపు
- పేషెంట్ బంధువులతో సంబంధం లేదు
- ప్రైవేట్ అంబులెన్స్ నిర్వాహకుల దందా
- ప్రాణాలతో చెలగాటమాడుతున్న వైనం

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలోని కొందరు ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్లు కమీషన్లకు కక్కుర్తిపడి పేషెంట్ల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కుయ్ కుయ్‌మని శబ్దం చేసుకుంటూ రహదారులపై శరవేగంగా వెళ్తున్న అంబులెన్స్ కనిపిస్తేనే ఆపదలో ఉన్నవారి ప్రాణాలు ఎలాగైనా కాపాడాలని అందరూ కోరుకుంటారు. క్షణం ఆలస్యమైతే ప్రాణాలు గాల్లో కలుస్తాయని, వేగంగా ఆస్పత్రికి చేర్చాలని అంబులెన్స్ డ్రైవర్లను దేవుడిలా వేడుకుంటారు. కానీ, ప్రాణాలు కాపాడాల్సిన కొందరు అంబులెన్స్ డ్రైవర్లు ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు చెల్లించే కాసులకు కక్కుర్తిపడి పేషెంట్ల బంధువులకు చుక్కలు చూపిస్తున్నారు. పేషెంట్‌ను ఒక ఆస్పత్రి నుంచి మరో ఆస్పత్రికి తీసుకెళ్లాల్సి వస్తే.. డ్రైవర్లకు రూ.వేలు ముట్టజెప్పాల్సి వస్తోంది. చావుబతుకుల మధ్య వ్యక్తిని తీసుకెళ్లాలన్నా.. మృతదేహాలను ఇళ్లకు తరలించాలన్నా అంబులెన్స్ ఓనర్లు/డ్రైవర్లు రూ.వేలకు వేలు బంధువుల ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. వెంటిలేటర్ ఉంటే ఒకటి, లేకుంటే మరో రేటు చెబుతూ బంధువులను అందినకాడికి దోచుకుంటున్నారు. బాధితుల అవసరాన్ని క్యాష్ చేసుకుంటున్నారు.

కరోనా నుంచే ..

కరోనా మహమ్మరితో అంబులెన్స్ దందా పురుడు పోసుకుంది. ఆ సమయంలో బాధితులను ఆస్పత్రులకు తరలించడంలో అంబులెన్స్ డ్రైవర్లే ధైర్యంగా పనిచేశారు. దీనిని ఆసరాగా చేసుకుంటున్న యాజమాన్యాలు తమ ఆస్పత్రులకే ఎక్కువమంది పేషెంట్లను తీసుకొస్తే కమీషన్ చెల్లిస్తామని ఆశ చూపాయి. ఇలా మొదలైన దందా ప్రస్తుతం పేషెంట్లను, వారి బంధువులను పీడించే వరకూ చేరింది. ఇది ఎంతలా అంటే.. ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్లు/ఓనర్లకు ముందుగానే రూ.లక్ష వరకు అడ్వాన్స్ చెల్లించి పేషెంట్లను తమ ఆస్పత్రికే తీసుకు రావాలని ఒప్పందం చేసుకుంటున్నాయి. పేషెంట్ బంధువుల నిర్ణయంతో సంబంధం లేకుండా అడ్వాన్స్ ఇచ్చిన ఆస్పత్రులకే తీసుకెళ్తున్నారు డ్రైవర్లు.

కనీస సౌకర్యాలు కూడా లేవు..

చాలా ప్రైవేట్ అంబులెన్స్‌ల్లో కనీస సౌకర్యాలు కూడా లేవు. నిపుణుడైన డ్రైవర్‌తోపాటు ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్ కలిగిన వ్యక్తి, టెక్నీషియన్ ఉండాలి. అయితే, ఒక డ్రైవరు తప్ప మెడికల్ పరిజ్ఞానం కలిగిన వారెవరూ అంబులెన్స్‌లో ఉండడంలేదు. మార్గమధ్యంలో పేషెంట్‌కు ఇబ్బందులు తలెత్తితే పరిస్థితి ఏమిటనేది లేకుండా దందా సాగిస్తున్నారు.

మృతదేహం తరలించాలన్నా..

జిల్లాలో ప్రభుత్వ అంబులెన్స్‌లు ఆరు, 108 వాహనాలు మరో ఆరు, ప్రైవేట్ అంబులెన్స్‌లు 36 వరకు ఉన్నాయి. ప్రైవేట్ అంబులెన్స్‌లు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల ఎదుట పేషెంట్ల కోసం పడిగాపులు కాస్తున్నాయి. పేషెంట్ చనిపోతే తరలించేందుకు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ అంబులెన్స్‌ను ఆశ్రయించాల్సి వస్తోంది బంధువులు. దీంతో 20 కి.మీ. దూరం వరకు రూ.5,000పైనే డ్రైవర్లు వసూలు చేస్తున్నారు. రాత్రి అయితే, ఈ రేటు మరింత పెరుగుతుంది. వాస్తవానికి ప్రభుత్వ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, డీసీహెచ్‌వో, డీఎంహెచ్‌వో, ఆర్టీఏ, పోలీస్ అధికారుల సమన్వయంతో చార్జీలు నియంత్రించాలి. వాటిపై అధికారుల పర్యవేక్షణ ఉండాలి. కానీ, ఆ దిశగా ఎవరూ చొరవ తీసుకోవడం లేదు. తమ పరిధి కాదంటే తమది కాదంటూ ఎవరికి వారే దాటవేస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న అంబులెన్స్ యజమానులు/డ్రైవర్లు బంధువులను నిలువు దోపిడీ చేస్తున్నారు.

అప్రమత్తంగా ఉండండి

- మంత్రి శ్రీధర్‌బాబు
- గోదావరి ఉధృతి పరిశీలన



అధికారులకు సూచనలిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని: భారీవర్షాలు, వరదల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలనిఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశించారు. పట్టణ శివారులోని గోదావరి నది వరద ఉధృతిని ఆయన క్షేత్రస్థాయిలో బుధవారం పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. విపత్తును ఎదుర్కొందుకు రాష్ట్రయంత్రాంగం చర్యలు తీసుకుంటోందన్నారు. మహారాష్ట్రలో కురుస్తున్న భారీవర్షాలతో మనరాష్ట్రంలోని ప్రాజెక్టులకు చేరుతున్న వరద ఉధృతిని అంచనా వేస్తూ ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. గతంలో కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌తో మంథనిలో వరద వచ్చి చేరిందని, ఇప్పుడు అలాంటి పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, మున్సిపల్, పంచాయతీ అధికారులు నియంత్రణ చర్యలు తీసుకోవాలని అన్నారు. విషజ్వరాలు వ్యాపించే గ్రామాల్లో వెంటనే వైద్యశిబిరాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఆస్పత్రులకు వచ్చే వారికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. పంట నష్టంపై అంచనా వేసి రైతులకు ధైర్యం చెప్పాలని వ్యవసాయ శాఖ అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. మున్సిపల్ చైర్ పర్సన్ పెంద్రు రమ, కమిషనర్ మల్లికార్జున్, మాజీ ఎంపీపీ కొండ శంకర్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముస్కుల సురేందర్‌రెడ్డి, నాయకులు పాపారావు, ఆజీంఖాన్, అరెల్లి కిరణ్‌గౌడ్ తదితరులు మంత్రి వెంట ఉన్నారు.

పంట రుణాలను రెన్యూవల్ చేయండి

పెద్దపల్లిరూరల్: రుణమాఫీ పొందిన రైతులకు పంట రుణాలను వెంటనే మంజూరు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం క్రాప్‌లోన్, ఆయిల్‌పాం సాగు, రేషన్‌కార్డు లేనిరైతుల వివరాల సేకరణపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రుణమాఫీ కాని రైతుల ఆధార్, బ్యాంకు పాసుబుక్‌లో పేరు, చిరునామా మార్పులపై దృష్టి సారించాలన్నారు. రేషన్‌కార్డులు లేనికుటుంబాల వివరాల కోసం సర్వే చేపట్టి జాబితా ఇవ్వాలని ఆదేశించారు. ఆయిల్‌పాం సాగు లక్ష్యాలను పూర్తి చేయాలని ఆయన సూచించారు. డీఏవో ఆదిరెడ్డి, ఉద్యాన అధికారి జగన్మోహన్‌రెడ్డి, లీడ్‌బ్యాంకు మేనేజర్ వెంకటేశ్ పాల్గొన్నారు.

'దూర విద్య'ను సద్వినియోగం చేసుకోండి

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్
- ప్రచార పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, తిరపతి నాయక్, సతీశ్, శ్రీనివాస్, సాగర్

గోదావరిఖనిటౌన్: మధ్యలో చదువు మానేసిన వారు దూర విద్యా విధానంలో చదువును కొనసాగించాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సూచించారు. కాకతీయ విశ్వవిద్యాలయం దూర విద్య డిగ్రీ, పీజీ కోర్సుల కోసం దూర విద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ రామచంద్రం సలహా మేరకు బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రచార పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, చదువుకోవాలనే ఉత్సాహం ఉన్న యువత దూర విద్యా విధానంలో ప్రవేశాలు పొంది డిగ్రీ పట్టా పొందవచ్చని తెలిపారు. రామగుండంలో బీ– పవర్ హౌస్ పునః ప్రారంభం కాబోతున్నదని, ఇక్కడి నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఉంటాయని ఆయన వివరించారు. 800 మెగావాట్ల పవర్ ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేస్తున్న ఎమ్మెల్యేను డిగ్రీ కళాశాల సిబ్బంది శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ తిరుపతి నాయక్, దూర విద్య అధ్యయన కేంద్రం కౌన్సిలర్‌లు కాంపెల్లి సతీశ్, సుద్దాల శ్రీనివాస్, పి.సాగర్, రామకృష్ణ, జెట్టి రాము, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'హైడ్రా' ప్రకంపనలు



చెరువు సమీపంలో ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

పెద్దపల్లిరూరల్: హైదరాబాద్‌లో చేపట్టిన హైడ్రా కూల్చివేతలు బుధవారం పెద్దపల్లికి చేరాయి. ఫిర్యాదులతో విచారణ చేపట్టిన అధికారులు పట్టణ శివారులోని బంధం చెరువు, రంగంపల్లి చిన్నకుంట, పెద్దకుంట ప్రాంతాల్లో రియల్టర్లు ఏర్పాటు చేసిన వెంచర్లను పరిశీలించారు. అందులో బంధం చెరువు బఫర్‌జోన్‌లో ఓ రియల్టర్ నిర్మించిన షెడ్లు, ప్రహరీని రెవెన్యూ, ల్యాండ్ సర్వేయర్, ఇరిగేషన్, మున్సిపల్ అధికారుల పర్యవేక్షణలో కూల్చేశారు. చెరువులు, బఫర్‌జోన్‌లను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టొద్దని వారు సూచించారు. అక్రమ నిర్మాణాలను గుర్తించి కూల్చివేస్తామని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్, టీపీవో శ్రీధర్ హెచ్చరించారు.

కోర్టు కానిస్టేబుళ్లే కీలకం

గోదావరిఖని: నేరస్తులకు శిక్ష పడడంలో కోర్టు కానిస్టేబుళ్ల బాధ్యత కీలకమని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పరిధిలోని పోలీస్‌స్టేషన్ల కోర్టు ఆఫీసర్లు, జన్ ఆఫీసర్లతో బుధవారం కమిషరేట్‌లో సమావేశమయ్యారు. అండర్ ట్రయల్ ఖైదీలను పోలీసు ఎస్కార్ట్‌తో కాకుండా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు ఎదుట ప్రవేశపెడితే పోలీ సులపై పనిభారం తగ్గుతుందని, సమయం ఆదా అవుతుందన్నారు. పెండింగ్, పెటీ కేసులు డిస్పోజల్ చేయాలన్నారు.

ఇళ్లను ముంచెత్తిన వరద

రామగుండం: మూడురోజుల పాటు ఏకధాటిగా కురిసిన వర్షం.. మంగళవారం కాస్త తెరిపి ఇచ్చినా.. బుధవారం మళ్లీ దంచికొట్టింది. దీంతో రామగుండం, పాలకుర్తి, అంతర్గాం మండలాల్లో వరద లోతట్టు ప్రాంతాలను ముంచెత్తింది. పత్తి చేలు, వరి పొలాల్లో భారీగా నీరు చేరింది. లింగాపూర్ మాజీ సర్పంచ్ ఇరికిల్ల శంకరయ్య ఇల్ల వర్షం ధాటికి కుప్పకూలింది. విసంపేట–మద్దిర్యాల మధ్య ప్రధాన రహదారిపై వరద ఉధృతి పెరిగింది. టీటీఎస్ అంతర్గాం గ్రామ పంచాయతీ కార్యాలయ సమీప కాలనీలను ముంచెత్తింది. పలు ఇళ్లలోకి వర్షపు నీరు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఎంపీడీవో ఎంఏ అలీం బాధితులను పరామర్శించారు.

'ఎల్లంపల్లి'కి తగ్గుతున్న ఇన్‌ఫ్లో

ఎల్లంపల్లి ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో క్రమంగా తగ్గుతోంది. ఎగువన కురుస్తున్న భారీవర్షాలు, వరదలు, ఎస్సారెస్పీ నుంచి నీటి విడుదలతో ఎల్లంపల్లిలోకి భారీగా వరద వచ్చి చేరింది. దీంతో 33 గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదిలిన అధికారులు.. ఇన్‌ఫ్లో తగ్గుతుండడంతో బుధవారం రాత్రి 7 గంటలకు 22 గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 3.61 లక్షల క్యూసెక్కులు కాగా, ఔట్‌ఫ్లో 2.44 లక్షల క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలు. ప్రస్తుతం 14.09 టీఎంసీలు ఉంది.

ఇళ్లలోకి చేరిన వర్షపునీరు

పాలకుర్తి(రామగుండం): కేశోరాం సిమెంట్ మైన్స్ – బసంత్‌నగర్ ప్రధాన రహదారి నుంచి వచ్చే వరదను మళ్లించడంతో మారుతీనగర్‌ను ముంచెత్తింది. బసంత్‌నగర్ పంచాయతీ కార్యదర్శి గంగాలక్ష్మి మారుతీనగర్‌ను సందర్శించి వరద పరిస్థితిని అంచనా వేశారని మాజీ వార్డుసభ్యుడు సంతోష్ తెలిపారు. కేశోరాం వర్కర్స్ కాలనీలో రోడ్లపై వరద ఉధృతి పెరిగింది. చెరువులు, వాగులు మత్తడులు పోస్తున్నాయి.

మళ్లీ దంచికొట్టిన వాన



అంతర్గాంలోని పత్తిచేలలో చేరిన వర్షపునీరు



వరద బాధితులను పరామర్శిస్తున్న ఎంపీడీవో అలీం

జిల్లాలో 34.9 మి.మీ. వర్షపాతం

పెద్దపల్లిరూరల్: జిల్లాలో బుధవారం సరాసరి వర్షపాతం 5.4 మి.మీ. నమోదు కావాల్సి ఉండగా అత్యధికంగా 34.9 మి.మీ. వర్షపాతం నమోదైంది. అంతర్గాంలో అత్యధికంగా 123.4 మి.మీ. వర్షం కురవగా, అతితక్కువగా ఓదెల మండలంలో 10 మి.మీ. వర్షపాతం నమోదైంది. ధర్మారంలో 57.4 మి.మీ., పాలకుర్తిలో 25.9 మి.మీ, రామగుండంలో 46.1 మి.మీ, రామగిరిలో 13.5 మి.మీ, కమాన్‌పూర్‌లో 32.1 మి.మీ, పెద్దపల్లిలో 27.5 మి.మీ, జూలపల్లిలో 29.0 మి.మీ, ఎలిగేడులో 36.8 మి.మీ, సుల్తానాబాద్‌లో 11.4 మి.మీ, కాల్వశ్రీరాంపూర్‌లో 39.2 మి.మీ, ముత్తారంలో 21.5 మి.మీ, మంథనిలో 14.7 మి.మీ. వర్షపాతం నమోదైందని అధికారులు వివరించారు.

కిష్టంపేటలో ఇల్లు ధ్వంసం

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): కిష్టంపేట గ్రామంలో సాగర్ల సదయ్యకు చెందిన గుడిసె బుధవారం కురిసిన భారీ వర్షానికి నేలమట్టమైంది. నిరాశ్రయుడైన సదయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

శిథిలమైన ఇళ్లు కూల్చివేత



ఇంటిని కూల్చివేస్తున్న పొక్లెయిన్

పెద్దపల్లిరూరల్: శిథిలావస్థకు చేరిన ఇళ్లను మున్సిపల్ సిబ్బంది కూల్చివేశారు. 21, 28 వార్డుల్లో మూడింటిని కూల్చి వేయించినట్లు కమిషనర్ వెంకటేశ్ తెలిపారు. శిథిలమైన ఇళ్లలో నివసిస్తే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని ఆయన తెలిపారు. అంతకుముందు వార్డు ఆఫీసర్లతో కమిషనర్ సమావేశమై పలు సూచనలు చేశారు. మేనేజర్ శివప్రసాద్, టీపీవో శ్రీహరి, వినయ్, రమాకాంత్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుండెపోటుతో రైతు మృతి

ఇల్లంతకుంట(మానకొండూర్): ఇల్లంతకుంట మండలం రహీంఖాన్‌పేటకు చెందిన రైతు ఏనుగుల మల్లయ్య(57) బుధవారం గుండెపోటుతో మృతిచెందాడు. రోజు మాదిరిగానే ఉదయం పొలం వద్ద ఉన్న గేదెలపాలు పితికేందుకు వెళ్లి, అక్కడే కుప్పకూలి మృతిచెందాడు. అక్కడే ఉన్న మల్లయ్య భార్య రోదనలు మిన్నంటాయి.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

ధర్మారం(ధర్మపురి): దొంగతుర్తి గ్రామానికి చెందిన గొర్రెలకాపరి పొలగాని ఐలయ్య (50)చికిత్స పొందుతూ బుధవారం మరణించినట్లు ఎస్సై శీలం లక్ష్మణ్ తెలిపారు. ఈనెల 1న సాయంత్రం ఐలయ్య గొర్రెలను మేపేందుకు తీసుకెళ్లి.. ఇంటికి తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై అతివేగంగా ఢీకొట్టాడు. ఈ సంఘటనలో ఐలయ్యకు మెడ, వెన్నుపూస, తలకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ఆరోగ్యం మెరుగు కాకపోవడంతో మరో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయాడు. మృతుడికి మారుడు ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

విష జ్వరంతో రైతు మృతి

గొల్లపల్లి: భీంరాజ్‌పల్లి గ్రామానికి చెందిన రైతు ఇత్తడి మల్లారెడ్డి (65) విషజ్వరంతో బాధపడుతూ బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన మల్లారెడ్డి పది రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయినా జ్వరం తగ్గకపోగా ప్లేట్‌లెట్స్ పడిపోయాయి. ఆరోగ్యం విషమించి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

దాడి చేశాడని మనస్తాపం..

- పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

మల్యాల(చొప్పదండి): మ్యాడంపల్లికి చెందిన తరాల లచ్చయ్య (50) అనే వ్యక్తి పురుగుల మందు తాగి మృతిచెందినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన గీకురు నారాయణ అనే వ్యక్తి తనను చెంపపై కొట్టడంతో అవమానంతో చనిపోతున్నట్లు లచ్చయ్య మృతదేహం వద్ద సూసైడ్ నోట్ లభించిందని పేర్కొన్నారు. లచ్చయ్య మృతికి కారణమని భావిస్తూ నారాయణపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు..?

పెగడపల్లి: మండలంలోని మద్దులపల్లికి చెందిన గన్నెబోయిన బాబు (52) మంగళవారం రాత్రి చేపలవేటకు వెళ్లి ఇంటికి రాలేదని ఎస్సై సీహెచ్ రవికిరణ్ తెలిపారు. చేపల వలతో చెరువు వద్దకు వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి రాలేదని, అతడి కోసం బుధవారం వెతికినా ఆచూకీ లభించలేదని, బాబు భార్య శంకరమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

గురుభ్యోనమః

- కాలానుగుణంగా బోధనలో మార్పులు
- విద్యార్థులతో మమేకమవుతున్న ఉపాధ్యాయులు
- ప్రయోగాత్మకంగా.. క్షేత్రస్థాయిలో పాఠాలు
- సర్కారు బడులకు ప్రాణం పోస్తున్న వైనం
- ఆదర్శంగా నిలుస్తున్న పలువురు ఉమ్మడి జిల్లా టీచర్లు
- నేడు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం



మన జీవితంలో ఉన్నత స్థానం గురువుకు ఇస్తాం. మనల్ని జ్ఞానవంతులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి వెలకట్టలేనిది. అలాంటి గొప్ప వ్యక్తులను స్మరించుకుంటూ మన దేశ రెండో రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఏటా సెప్టెంబర్ 5న జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటున్నాం. కాలానుగుణంగా విద్యాబోధనలో మార్పులొస్తున్నాయి. టీచర్లు విద్యార్థులతో మమేకమవుతూ, ప్రయోగాత్మకంగా పాఠాలు చెబుతున్నారు. జీవితంలో ఎదుర్కొనే సమస్యలపై అవగాహన కల్పిస్తూ వారి భవిష్యత్‌కు భరోసానిస్తున్నారు. నేడు నేషనల్ టీచర్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు ఆదిత్య

ఎనిమిదేళ్లుగా సెలవు తీసుకోలే..

తిమ్మాపూర్: తిమ్మాపూర్ మోడల్ స్కూల్ ఇంగ్లిష్ పీజీటీగా పనిచేస్తున్న జి.ఆదిత్య ఎనిమిదేళ్లుగా ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదు. డీఎస్సీ-2003 బ్యాచ్‌లో టాపర్‌గా నిలిచి మంచిర్యాల జిల్లా తాండూరు మండలం రేచిని జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేశారు. 2011లో పీజీటీగా ఉద్యోగం సాధించి 2013 జూన్ 19న తిమ్మాపూర్‌లోని మోడల్ స్కూల్‌లో ఇంగ్లిష్ టీచర్‌గా చేరారు. ఏటా పబ్లిక్ పరీక్షల్లో ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో 100 శాతం ఫలితాలు సాధిస్తున్నారు. 2018లో రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్నారు. చాలామంది విద్యార్థులు పోలీసు, డిఫెన్స్ ఉద్యోగాలు సాధించేందుకు కృషి చేశారు.

భవిష్యత్‌కు భరోసా



తిరుపతి

కరీంనగర్: హుజూరాబాద్ మండలంలోని కందుగుల జెడ్పీహెచ్‌ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్(సోషల్) ఓరుగంటి తిరుపతి విద్యార్థులతో ఫీల్డ్ విజిట్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. వనరుల వినియోగం, చెరువుల సందర్శన, చేనేత కార్మికులు, జానపద కళాకారుల జీవన స్థితిగతులపై వారిని నేరుగా తీసుకెళ్లి, అవగాహన కల్పిస్తున్నారు. రిసోర్స్ పర్సన్‌గానూ చేశారు. సామాజిక రుగ్మతలు, సైబర్ నేరాలను పిల్లలకు వివరిస్తూ భవిష్యత్‌కు భరోసా కల్పిస్తున్నారు.

ప్రయోగాలతో బోధన



ప్రయోగంతో విద్యార్థులకు పాఠం చెబుతున్న చంద్రశేఖర్

కథలాపూర్: కథలాపూర్ మండలం భూషణరావుపేట గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ ఫిజికల్ సైన్స్ టీచర్ సంక చంద్రశేఖర్ విద్యార్థులకు పాఠ్యాంశాలు సులువుగా అర్థం కావాలని ప్రయోగాలతో బోధిస్తున్నారు. ఈ ఉపాధ్యాయుడి ఆధ్వర్యంలో తయారు చేసిన స్పైరల్ స్క్రూ, నీళ్లను వేడి చేయడం, కుంభాకర కటకంతో ప్రతిబింబాలు అనే ప్రయోగాలు రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యాయి. ప్రయోగాలతో విద్యార్థులకు వివరిస్తే త్వరగా పాఠాలు అర్థమవుతాయని పేర్కొన్నారు.

సేవ.. బోధన.. రాష్ట్రస్థాయి గుర్తింపు



అంజన్‌కుమార్

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం టీటీఎస్ జెడ్పీ హైస్కూల్ జీవశాస్త్ర ఉపాధ్యాయుడు గూళ్ల అంజన్‌కుమార్ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. 10వ తరగతి బయోలాజికల్ సైన్స్‌లో విద్యార్థులు 10 జీపీఏ సాధించేలా సాంకేతికతను జోడిస్తూ బోధిస్తున్నారు. 2022లో విద్యారత్న జాతీయ అవార్డు అందుకున్నారు. పెద్దపల్లి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో 80 యూనిట్ల రక్తాన్ని అందించారు. ఎన్నికలకు మాస్టర్‌ట్రైనర్‌గా, విద్యా శిక్షణకు రిసోర్స్‌పర్సన్‌గా పనిచేస్తూ.. ఉన్నతాధికారుల మన్ననలు పొందారు.

పాఠాలను కథలుగా చెబుతూ..



అనసూయ

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరు జెడ్పీ పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు ఎడవల్లి అనసూయ విద్యార్థులకు కథల ద్వారా విద్యాబోధన చేయడం ద్వారా గుర్తింపు పొందారు. 1984లో ఎస్జీటీగా చేరి, 2002లో పదోన్నతి పొంది, ఎస్‌ఏగా పనిచేస్తున్నారు. పన్నెండేళ్లుగా నగునూరు స్కూల్లో విద్యార్థులకు కథల ద్వారా పాఠాలు బోధిస్తున్నారు. పుస్తకాలపై విద్యార్థులకు ఆసక్తి కలిగిస్తున్నారు. దశాబ్దకాలంగా ఎస్సెస్సీ వార్షిక పరీక్షల్లో తెలుగులో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నారు.

టీ-శాట్ బోధన



మార రమేశ్

పెద్దపల్లిరూరల్: రాష్ట్రవ్యాప్తంగా పాఠశాల విద్యార్థులకు దీక్ష పోర్టల్, ఐఎఫ్‌బీ ప్యానల్‌కు డిజిటల్ కంటెంట్ తయారు చేయడంతోపాటు టీ-శాట్ ఛానల్ ద్వారా బ్రిడ్జి కోర్సు విద్యార్థులకు డిజిటల్ తరగతులు బోధించారు పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల సోషల్ టీచర్ మార రమేశ్. ఆయన రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు.

ఆర్పీగా టీచర్లకు సహకారం



రఘుపతిరావు

రామగుండం: సాదినేని రఘుపతిరావు ఉమ్మడి రామగుండం మండల రిసోర్స్ పర్సన్‌గా ప్రతీ బడిలో టీచర్లకు సంపూర్ణ సహకారం అందించారు. ప్రస్తుతం బ్రాహ్మణపల్లి యూపీఎస్ హెచ్‌ఎంగా పని చేస్తున్నారు. బడిబయట ఉన్న పిల్లలను స్కూళ్లలో చేర్పించడం, వేసవి విద్యా శిబిరాల్లో ప్రత్యేక బోధన, వసతి గృహాల్లో తరగతుల నిర్వహణ, వలస కార్మికుల పిల్లల కోసం స్కూళ్ల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇచ్చారు.

ఉపాధ్యాయుడిగా.. కాలమిస్టుగా



శంకర్ గౌడ్

సిరిసిల్ల ఎడ్యుకేషన్: కోనరావుపేట మండలం మల్కపేటకు చెందిన పాకాల శంకర్ గౌడ్ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఎస్జీటీగా 1998లో ఉద్యోగ జీవితం ప్రారంభించిన ఆయన పాఠ్యాంశాల బోధనకు ప్రాధాన్యం ఇస్తూనే ఉపాధ్యాయ సంఘం నాయకుడిగా, కాలమిస్టుగా రాణిస్తున్నారు. ప్రస్తుతం కుసుమ రామయ్య బాలుర ఉన్నత పాఠశాల సిరిసిల్లలో స్కూల్ అసిస్టెంట్(ఫిజికల్ సైన్స్)గా పని చేస్తున్నారు. విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచేందుకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నారు. 2020 కరోనా కాలంలో విద్యార్థులకు ఆన్‌లైన్ పాఠాలు బోధించారు. డాక్టర్ల సహాయంతో రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా కరోనా హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశారు. ఆయన గైడ్ టీచర్‌గా తయారు చేసిన పవర్‌లూమ్ క్లాత్ ఫోల్డింగ్ మెషిన్ 2022-23లో ఇన్‌స్పైర్ మనాక్ జాతీయస్థాయి ప్రదర్శనకు ఎంపికైంది.

సొంత ఖర్చుతో మరుగుదొడ్లు



యోగా నేర్పుతున్న రమేశ్‌గౌడ్

సుల్తానాబాద్: స్థానిక అశోక్‌నగర్ ఎంపీపీఎస్‌లో టీచర్‌గా పని చేస్తున్న బి.రమేశ్‌గౌడ్ కార్పొరేట్ తరహాలో విద్యార్థులకు విద్యాబోధన చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. పాఠశాలలో 40 మంది విద్యార్థులు ఉండగా కొత్తగా మరో 50 మందిని చేర్పించాను. అందరికీ యోగా నేర్పిస్తున్నారు. సొంత ఖర్చుతో బాలికలకు, బాలురకు మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించారు. పేద పిల్లలకు నోటుబుక్స్ ఇచ్చారు. తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహిస్తూ పిల్లలకు హోంవర్క్ చేయించడంపై సూచనలు చేస్తున్నారు.

పేద పిల్లలను బడిలో చేర్పించా



హుజూరాబాద్‌రూరల్: నేను పని చేస్తున్న పాఠశాల చుట్టుపక్కల ఉండేది అందరూ నిరుపేదలే. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబాలు. వారి జీవితాల్లో చదువు అనే వెలుగు లేకపోవడం వల్లే ఇన్ని ఇబ్బందులు పడుతున్నారని భావించాను. అందుకే వారి పిల్లలను బడిబాట కార్యక్రమంలో పాఠశాలలో చేర్పించి, విద్యాబుద్ధులు నేర్పుతున్నాను. నాకు ఎంతో ఆత్మ సంతృప్తి కలుగుతోంది.

- బి.ప్రభాకర్, ఉత్తమ ఉపాధ్యాయుడు, గణేశ్‌నగర్

డిజిటల్ పాఠాల ప్రసారం



నందిని శ్రీనివాస్

కరీంనగర్ కల్చరల్: కరీంనగర్‌లోని కార్ఖానాగడ్డ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న నందిని శ్రీనివాస్ డిజిటల్ పాఠాలకు రూపకల్పన చేశారు. వాటిని తెలుగు దళం చానల్ ద్వారా ప్రసారం చేశారు. వాటిని రాష్ట్రవ్యాప్తంగా 40 వేల నుంచి 50 వేల మంది విద్యార్థులు యూట్యూబ్‌లో వీక్షించారు. పిల్లలకు మంచి అలవాట్లు, భగవద్గీత శ్లోకాలు, పాటలు, ధ్యానం నేర్పించడానికి సంస్కార వారధి ద్వారా శిక్షణనిస్తున్నారు. మన రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాలు, మలేషియా, సింగపూర్, అమెరికా వంటి దేశాలకు చెందిన 2 వేల మందికిపైగా చిన్నారులు శిక్షణ పొందారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకులు



డా.పద్మావతి

కరీంనగర్ సిటీ: కరీంనగర్ శాతవాహన విశ్వవిద్యాలయంలో సోషియాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డా.కె.పద్మావతి రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకురాలిగా ఎంపికయ్యారు. 1991లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీజీ, 2001లో ఉస్మానియా యూనివర్సిటీ సోషియాలజీ విభాగం నుంచి డాక్టోరియల్ డిగ్రీ పూర్తి చేశారు. ఆమె మార్గదర్శకత్వంలో ఇద్దరు విద్యార్థులకు డాక్టరేట్ పొందారు. పద్మావతి తెలుగులో 65 వ్యాసాలు, ఆంగ్లంలో 35 వ్యాసాలు రాశారు. సుకన్య సమృద్ధి యోజనపై ఐసీఎస్ఎస్ఆర్ స్పాన్సర్ చేసిన పరిశోధన ప్రాజెక్టుకు కో-డైరెక్టర్‌గా పని చేశారు. శాతవాహన విశ్వవిద్యాలయంలో 2 జాతీయ సెమినార్లు నిర్వహించారు.

జగిత్యాల మహిళా డిగ్రీ కాలేజీ ప్రొఫెసర్



ప్రమోద్‌కుమార్

జగిత్యాల: జగిత్యాల మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ ప్రమోద్‌కుమార్ రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడి అవార్డుకు ఎంపికయ్యారు. కథలాపూర్ మండలం తక్కళ్లపల్లికి చెందిన ఆయన కోరుట్లలో విద్యాభ్యాసం పూర్తి చేసి, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు చేశారు. అధ్యాపక వృత్తి ఉంటూనే తెలుగు సాహిత్యంలో రాణిస్తూ రచనలు చేశారు. ప్రమోద్‌కుమార్‌ను కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, అధ్యాపకులు అభినందించారు.

కరీంనగర్ ఎస్సారార్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్

కరీంనగర్‌సిటీ: రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా కరీంనగర్ ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల కామర్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.భూర్ల నరేశ్ ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డా.వై.సత్యనారాయణ బుధవారం తెలిపారు. జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన ఆయన 2013 జనవరి 1న అప్పటి పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా డిగ్రీ కళాశాల అధ్యాపకుడిగా నియమితులయ్యారని పేర్కొన్నారు. 12 ఏళ్లుగా కామర్స్ బోధిస్తూ పాఠ్యపుస్తక రచయితగా 5 పుస్తకాలను రచించారన్నారు. 20 జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ఆయన పరిశోధన అంశాలు ప్రచురితమయ్యాయని తెలిపారు.

చిన్నారిపై వీధికుక్క దాడి



గాయపడిన శ్రీహన్షీ

చిగురుమామిడి: నవాబుపేట్‌కు చెందిన కక్కెర్ల శ్రీహన్షీ(5)పై వీధికుక్క బుధవారం దాడిచేసి తీవ్రంగా గాయపర్చింది. అంగన్‌వాడీ నుంచి సాయంత్రం ఇంటికి వస్తున్న చిన్నారిపై జెడ్పీ హైస్కూల్ ఎదుట కుక్క ఒక్కసారిగా దాడిచేసింది. స్థానికులు స్పందించి వీధికుక్కను తరిమేశారు. ఈ ఘటనలో చిన్నారి నుదిటిపై, వీపుపై తీవ్ర గాయాలైనట్లు తండ్రి శ్రీనివాస్ తెలిపారు. బాలికను వెంటనే కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్‌లోని మరో ఆస్పత్రికి రెఫర్ చేశారు. అయితే, తమ గ్రామంలో వీధికుక్కల బెడద అధికంగా ఉందని గ్రామపంచాయతీ పాలకులకు గతంలో అనేకసార్లు ఫిర్యాదు చేశామని, ప్రస్తుతం ప్రత్యేకాధికారికి విన్నవించినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపించారు. కుక్కల బెడద నుంచి గ్రామస్తులను కాపాడాలని మాజీ వార్డు సభ్యుడు సత్యనారాయణ, బోయిని సంపత్, సదానందం, బాబు, వంశీకృష్ణ, తదితరులు కోరారు.

నవవధువు ఆత్మహత్య

- ఈ లోకంలో ఉండడం ఇష్టం లేదని..
- తన చావుకు ఎవరూ కారణం కాదంటూ..
- చేతిపై రాసుకుని ఉరేసుకున్న వైనం

మల్యాల(చొప్పదండి): కాళ్లపారాణి ఆరకముందే నవ వధువు కాటికి చేరింది. ఏం జరిగిందో ఎవరికీ తెలియదు.. తల్లిదండ్రులకు పుట్టెడు దుఃఖాన్ని మిగిల్చి కానరాని లోకాలకు వెళ్లిపోయింది. తన చావుకు ఎవరూ బాధ్యులు కారని, తన చావుకు తానే కారణమని తనువు చాలించింది. 'తాను ఎవరి కారణం వల్ల చనిపోవడం లేదు.. నన్ను ఎవరూ ఏమీ అనలేదు.. నాకే ఈ లోకంలో ఉండడం ఇష్టం లేదు. అందుకే వెళ్లిపోతున్నా..' అంటూ చేతిపై రాసుకుని ఓ నవ వధువు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని తక్కళ్లపల్లి గ్రామంలో విషాదం నింపింది. ఎస్సై నరేశ్ కథనం ప్రకారం.. తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన పానుటి భాగ్యలక్ష్మీకి ఇదే మండలం మ్యాడంపల్లికి చెందిన ఉదయ్‌కిరణ్‌తో గతనెల 18న వివాహమైంది. అప్పటి నుంచి ఇద్దరూ హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. ఈనెల 3న భాగ్యలక్ష్మీని తల్లిదండ్రులు పుట్టినింటికి తీసుకొచ్చారు. బుధవారం తల్లిదండ్రులు మల్యాల వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో భాగ్యలక్ష్మీ బాత్రూంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సంఘటనా స్థలాన్ని ఎస్సై సందర్శించారు. సంఘటనపై వివరాలు సేకరించారు. భాగ్యలక్ష్మి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ కుమార్ తెలిపారు.



భాగ్యక్ష్మి(ఫైల్)

సులభమైన బోధనకు పురస్కారం

- జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల పనితీరుకు నిదర్శనం



ప్రభాకర్‌రెడ్డి



ఎస్.అనురాధ



రాజేశ్వరి

పెద్దపల్లిరూరల్: విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా విద్యాబోధన, క్షేత్రస్థాయి పరిశీలన, కృత్యాధార బోధనతో ఉపాధ్యాయులు ప్రత్యేకత చాటుకుంటున్నారు. ప్రయోగశాలలో కృత్యాలను వివరిస్తూ ప్రాక్టికల్స్ చేయిస్తూ అవగాహన పెంచుతున్నారు. దీంతో విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారు. ఇలా ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయులు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తింపు పొందుతున్నారు. జిల్లావ్యాప్తంగా 42మంది ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వారికి గురువారం కలెక్టరేట్‌లో టీచర్స్‌డే సందర్భంగా సత్కరించనున్నారు.

గోదావరిఖనిలో..

గోదావరిఖనిటౌన్: స్థానిక విఠల్‌నగర్ అప్పర్ ప్రైమరీ స్కూల్ టీచర్, తిలక్‌నగర్‌కు చెందిన కందుగుల రాజేశ్వరి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. వినూత్న పద్ధతిలో విద్యా బోధన చేయడం, విద్యార్థుల సంఖ్య పెంచడం, వేసవి సెలవుల్లో విద్యార్థులకు మోడల్ స్కూల్, ఇతర పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వడంలో కృషి చేశారు. స్థానిక ప్రభుత్వ గర్ల్స్ హైస్కూల్‌లో గ్రేడ్-2 హెచ్‌ఎం ఇజ్రాయిల్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు.

కాల్వశ్రీరాంపూర్‌లో..

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): బి.జయప్రకాశ్, స్కూల్ అసిస్టెంట్(జెడ్పీహెచ్‌ఎస్ -పెగడపల్లి), కె.పల్లవి, ఎస్జీటీ(ఎంపీపీఎస్-వెన్నంపల్లి), టి.అరుణ, ఎల్‌పీహెచ్(ఎంపీపీఎస్-అంకంపల్లి) జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.



విద్యాబోధన చేస్తున్న గసిగంటి దేవేందర్, కల్వలచర్ల



జయప్రకాశ్

సుధారాణి

రాధాస్వామి

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): నారాయణాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ ఎస్‌ఏ(ఇంగ్లిష్) టీచర్ సుధారాణి, రేగడిమద్దికుంట జెడ్పీహెచ్‌ఎస్ జీహెచ్‌ఎం జీఆర్ రాధాస్వామి, సుల్తానాబాద్ అశోక్‌నగర్ ఎంపీపీఎస్ ఎస్జీటీ రమేశ్ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్లు ఎంఈవో సురేందర్ తెలిపారు.

పాలకుర్తి(రామగుండం): బసంత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు టీచర్ ఎస్.అనురాధ(స్కూల్ అసిస్టెంట్), జీడీనగర్ ప్రాథమిక పాఠశాల ఎస్జీటీ ప్రభాకర్‌రెడ్డి జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. 1998 డీఎస్సీ బ్యాచ్‌కు చెందిన అనురాధ ఉత్తమ విద్యా బోధన చేస్తూ, క్రమం తప్పకుండా విధులకు హాజరవుతున్నారు. బసంత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొలిసారి పోస్టింగ్ తీసుకున్నారు. ప్రస్తుతం అదేపాఠశాలలో విద్యాబోధన చేస్తున్నారు. 2003 డీఎస్సీ బ్యాచ్‌కు చెందిన ప్రభాకర్‌రెడ్డి దాదాపు 16 ఏళ్లుగా రిసోర్స్ పర్సన్‌గా పనిచేస్తున్నారు. మూడేళ్లుగా జీడీనగర్ స్కూల్‌లో విద్యాబోధన చేస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధతోపాటు స్కూల్‌కాంప్లెక్స్ మీటింగ్‌లలో టీచర్లకు తెలుగు, గణితం సబ్జెక్ట్‌లపై శిక్షణ ఇస్తుంటారు.



ఇజ్రాయిల్



పల్లవి



అరుణ

విద్యార్థులతో మమేకమవుతా

తరగతి గదిలో విద్యార్థులతో మమేకవుతా. వారు కృత్యాల్లో పాల్గొనేలా ప్రోత్సహించి బోధన, అభ్యసన ప్రక్రియ సాగిస్తా. ప్రయోగశాలలో కృత్యాలన్నీ చేయిస్తా. పిల్లలస్థాయిని బట్టి బోధన చేస్తూ అర్థమయ్యేలా వివరిస్తా. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం సంతోషంగా ఉంది.

- జయప్రకాశ్‌రెడ్డి, పెగడపల్లి, కాల్వశ్రీరాంపూర్

పరిశీలనలతో అవగాహన

విద్యార్థులకు కృత్యాధార బోధనలు, క్షేత్రస్థాయి పరిశీలనతో సులువుగా బోధించి అవగాహన కల్పిస్తా. జిల్లా రిసోర్స్ పర్సన్‌గా పనిచేసి విద్యార్థుల్లో నైపుణ్యం పెంచుతున్నా. ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తింపు దక్కడం సంతోషకరం.

- గసిగంటి దేవేందర్, కల్వచర్ల, రామగిరి మండలం

వరద బాధితులను ఆదుకోవాలి

గోదావరిఖని: వరద బాధితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఆదుకోవాలని ఐఎఫ్‌టీయూ జాతీయ సహాయకార్యదర్శి కె.విశ్వనాథ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వారం రోజులుగా కురుస్తున్న భారీవర్షాలతో నివాస, ఆహార సమస్యలు తలెత్తాయని తెలిపారు. అనేక ప్రాంతాల్లో రోడ్లు, నివాసాలు జలమయమయ్యాయని పేర్కొన్నారు. విపత్కర పరిస్థితుల్లో అనేక వ్యాధులు ప్రబలుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వైద్య, రక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలు, మృతుల కుటుంబాలకు రూ.50లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

పేకాటస్థావరంపై దాడి

జ్యోతినగర్(రామగుండం): స్థానిక అన్నపూర్ణకాలనీలోని ఓ వ్యక్తి ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో గతనెల 25న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారని ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందులో ఓ జాతీయ స్థాయి పార్టీ నాయకురాలి భర్త ఒకరు అక్కడి నుంచి పరారయ్యారు. పేకాటస్థావరంలో రూ.7,630 నగదు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఎన్టీపీసీ పోలీసులకు అప్పగించారు. ఈ విషయంపై ఎస్సై సతీశ్‌ను సంప్రదించగా, పేకాట స్థావరంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్న విషయం వాస్తవమేనన్నారు. రాత్రి సమయం కావడంతో ఈవిషయాన్ని మీడియాకు వెల్లడించలేకపోయామని తెలిపారు.

విచారణ పేరిట వేధింపులు

- హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్‌అహ్మద్

గోదావరిఖని: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను డీడీఎంఎస్ విచారణ పేరుతో వేధింపులకు గురిచేస్తోందని హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్‌అహ్మద్ విమర్శించారు. సింగరేణి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడిని బుధవారం ఆయన పరామర్శించారు. గని ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న కార్మికులను ప్రమాదంపై విచారణ పేరుతో అధికారులు ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. జీడీకే-2వ గనిలో ప్రమాదం జరిగి ముగ్గురు కార్మికులు గాయపడ్డారని, చికిత్స పొందుతున్న వారి వద్దకు వెళ్లి డీడీఎంఎస్ అధికారులు విచారణ చేపట్టడం సరికాదన్నారు. ఆరోగ్యం కుదుట పడిన తర్వాత విచారణ చేపడితే అభ్యంతరం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ వెంట నాయకులు జక్కుల నారాయణ, దారవేణి కొమురయ్య, రాంచందర్, బోయిని శ్రీనివాస్, ఎండీ రహీం తదితరులు పాల్గొన్నారు.